# ఇరుగూ పొరుగూ

'రామ్మూర్తి' కాఫీ త్రాగి, డ్రస్ వేసుకుంటున్నాడు. అప్పుడే, ఎనిమిది దగ్గరవుతోంది. శ్రీదేవి వంటింటి తలుపు గొళ్ళెంవేసి, బాత్‌రూంలోనికి వెళ్ళబోతు బయట వరండాలో అప్పారావు నించోటం చూచి ఆగిపోయింది.

'ఇల్లావస్తారా రామంగారూ! మీతో కొంచెం మాట్లాడాల్సిన పని ఉంది. ఒక్క అయిదు నిమిషాలు టైం నాకోసం స్పేర్ చెయ్యాలి. మీరు' అన్నాడు అప్పారావు రామూర్తి కొంచెంసేపు విస్తుబోయాడు. రామ్మూర్తికి అప్పా రావుతో ఏమి స్నేహంలేదు. అసలు ఒకచోటకూర్చుని కబుర్లు ఎప్పుడూ చెప్పుకోలేదు. అప్పారావు ఆ ఇంటిలోనికి రాక పూర్వం అతని మొఖమెలా వుంటుందో కూడా రామూర్తికి తెలీదు. ఇంతాచేస్తే, అప్పారావు, రామూర్తివాళ్లూ అద్దె కుంటున్న ఇంటిలో, పక్కవాటాలోనికి దిగి పది పదిహేను రోజులుకన్నా ఎక్కువకాలేదు. తనతో మాట్లాడాల్సిన పని ఆయనకు ఏమివుందా అనుకుంటూనే రామూర్తి వరండా లోనికి వచ్చాడు.

మీరు ఏమీఅనుకోకపోతే ఒకసంగతి చెప్తాను. నా. దీ ప్రస్తావనగా అన్నాడు అప్పారావు

'అనుకుందు కేముంటుంది? చెప్పండి అన్నాడు. రామ్మూర్తి అతను కేవలం, కోటెనంటు! తనతో 'మీరు కాలవ జాగ్రత్తగా కడిగించాలనో, లేక ఇంటివారికి వెల్లలు వేయించమని వ్రాయాలనో చెప్తావనుకున్నాడు. రామ్మూర్తి అంచేత సాఫీగా చెప్పండి విషయ మేమిటో' అన్నాడు రామ్మూర్తి.

'మీ భార్యని మాటలు తొందరగా జారవద్దని చెప్పండి అసలు ఆమెతోనే గట్టిగా, చెప్పమని, మా ఇంటామె అన్నది. కాని నేనే. సందేహించాను! తప్పు! ఆడామెతో నేను మాట్లాడటం, బాగోదు! ఆయనతో చెప్తాను. అని. మా ఇంటామెని సముదాయించాను. నలుగురు పిల్లలు జెల్లలూగల వాళ్ళం! పొరుగున పోరు పెడుతూంటే, ఇంట్లో వుండటం కష్టం. చూడండి? అన్నాడు అప్పారావు, హాలులో నించున్న శ్రీదేవి కాళ్లు గజగజా వణికాయి. తల తిరిగిపోయింది. తన జీవితంలో ఇదే మొదటిసారి. పరాయివాళ్ళచేత, తను నోరు జారదని, అనిపించుకోవటం! శ్రీ దేవి కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. అల్లానేబల్లిలా, గోడకంటుకుపోయి నించుండిపోయింది రామ్మూర్తి, క్షణం నిర్ఘాంతపోయాడు. పదేళ్ళుగా, తను శ్రీదేవితో సంసారం చేస్తున్నాడు. ఏ విషయంలోనూ, తన మాటకి, ఎదురుచెప్పి ఎరుగదు. ఈ పదేళ్ళల్లోనూ, మూడు వూళ్ళు మారారు. ఏ వూరునించి, తాము బదిలీ. అయి వచ్చేస్తున్నాకూడా ఇరుగూ పొరుగూ, తమ, మంచితనానికి కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంటూ, తమకు వీడ్కోలిచ్చేవారు.

అల్లాంటిది, ఈ అప్పారావు ఫామిలీ, తమ ప్రక్కవాటాల్లోనికి వచ్చి, పది పదిహేను రోజులుకన్నా, ఎక్కువ కాకపోయినా. అప్పుడే తనభార్యయొక్క గయ్యాళీతనం తమకువిశదపరుస్తూ, తనకి అల్టిమేటం ఇస్తున్నాడు. ఇందులో, నిజా నిజాలు, తను శోధిస్తూ కూర్చుంటే, తనకి అవతల ఆఫీసుకి వేళయిపోతూంది. అందుకని, నెమ్మదిగా దృఢంగా.

'అల్లాగేలెండి! నా ఆఫీసుకి టయిమయి పోతోంది వస్తాను! అని సైకిలు ఎక్కి, ఆఫీసుకి వెళ్ళిపోయాడు. శ్రీదేవి హాలు తలుపుమూసి వచ్చింది. ఆమె మనస్సు మనస్సులో లేదు. ఇంతసేపూ ఆమే భర్త అప్పారావుకి ఏమి జవాబు చెప్తాడో, అన్న సందేహంతో కొట్టుకలాడింది. అతను ముభావంగా ఏదో అనేస్సి, తన మా నాన్న తమ ఆఫీసుకి వెళ్ళిపోవటంతో, అతను తన నేరాన్ని అంగీకరించి వున్నట్లు రూఢి అయ్యింది. అది 'శ్రీదేవి'కి ఎంతో, తల తీసేసినట్లు అనిపించింది. సత్యా సత్య, విమర్శనలతో అవసరం లేకుండానే తన్ని ఎవరు ఏది అన్నా, నమ్మేసే, భర్త గురించి ఏదన్నా చెప్తే, అల్లా తేలిగ్గా దులిపేసి, నిర్లక్ష్యంగా వుండగలదా! అదే ఆడవాళ్ళకీ, మగవాళ్ళకీ, వున్న తేడా! తను తన భార్యతో ఎన్ని రోజులుగా, సంసారం చేస్తోన్న, ఎవరన్నా ఏదన్నా చెప్తే, ఇట్టే నమ్మేసి బహుశా, ఆమె అల్లాగే చేసి వుంటుందిలే అనే నిర్ధారణకి వచ్చేస్తారు. అదే భార్యఅయితే ఆ మాత్రం మాకు తెలీదా! ఆయనతో ఇన్ని రోజులుగా సంసారం చేస్తున్నాను! మీరేదో పొరపాటుపడి వుంటారు!' అనేస్తారు.

భార్యల అపవాదుల్ని భర్తలు పరమసంతోషంతో స్వీకరిస్తారు. తమేదో పెద్ద త్యాగదనులుగా పోజులిస్తూ అపవాదులతో కృంగిపోతున్న స్త్రీసిని వుద్ధరిస్తున్నట్లు మురిసిపోతారు. భర్తల అపవాదులు. ఒక వేళ ఆ వాదులు నిజమయినా, భార్యలు అల్లా తీసిపారెయ్యలేరు. ఆ వాదులు అసత్యమని, తమని తమ్ము నమ్మించుకుంటూ, లోకాన్ని కూడా నమ్మించటానికి వృధా ప్రయత్నాలు చేస్తూనే వుంటారు. శ్రీదేవి తనలో తను, మల్లాగుల్లాలు పడుతూ, వంటింట్లో వంటపని చూసుకో సాగింది.

'ఇదుగో! ఆయనతో చెప్పాను. జాగ్రత్తగా చూసుకుంటానని మాటిచ్చాడు! నువ్వు నీ మానాన్న నీ పని చూచుకో దాని జోలికిపోకు' అన్నాడు అప్పారావు. శ్రీదేవి శరీరంకంపించింది. తనేం చేసిందని వీళ్లు ఇలా తన్ని రోడ్డు మీదకు లాగుతున్నారు.

'ఏమో బాబూ! మీ మానాన్న మీరు ఆపీసుకి వెళ్ళిపోతారు. మీరు వెళ్ళిపోగానే మళ్ళీ అది ఎవరు లేకుండా చూసి నామీద విరుచుకు పడిపోతుంది' బెంగగా అంది. నాగమణి.

'ఏదన్నా వాగితే మళ్ళీ ఆయనతో చెప్తాలే నువ్వేం భయపడకు' హామీ ఇచ్చాడు అప్పారావు.

అప్పారావు బయటికి వెళ్ళిపోయ్యాడు. శ్రీదేవి వంటిం ట్లోంచి బయటకి రాకుండ అక్కడికక్కడే పనులు చేసుకుం టోంది.

'పిన్నిగారూ:' అన్న సంభోదన విని వెనక్కి తిరిగి చూచింది అప్పటికప్పుడే అప్పారావు పెదకూతురు అనసూయ వంటింటిలోనికివచ్చి పీటవాల్చుకొని కూర్చుంటూ. 'వంట మొదలెట్టా లేమి! అంది. పెద అరిందాలా అనసూయకి మహావుంటే పద్నాలుగు, పదిహేనేళ్ళు కన్నా ఎక్కువ వుండవు. హైస్కూల్లో, ఫోర్తుఫారం చదువుకుంటోంది 'వూ' అంది. శ్రీదేవి. శ్రీదేవికి, వంట చేస్తుకుంటుంటే ఎవరన్నా వచ్చి కూర్చుంటే చెడ్డ చిరాకుగా వుంటుంది. అయినా, తలుపు లేసుకుని కూర్చోకపోవటం, తనదే తప్పని వూహకుంది. ప్రక్క ప్రక్క వాటాలలో వుంటున్నా, ఏమన్నా పేరంటాలు ఆయితేతప్ప, తోడప్రొక్కిడిగా ఒక వాటాలోంచి, ఇంకో వాటాలోకి పరుగులు తీయటం, శ్రీదేవికి అంతగా నచ్చదు. తనకు పనివున్నప్పుడు పని చేసుకోవడం, లేనప్పుడు తన మానాన్నతను. ఏ పుస్తకము చదువుకుంటూనో, లేక రేడియో వింటూనో కాలక్షేపంచేస్తుంటుంది. ఆమె ఈవంటరి తనాన్ని చాలామంది మంచితనంగా భావించుతూ వచ్చారు. ఒకరిజోలి పొంటే అక్కర్లేదు ఆమెకి అని అభినందించేవారు.

'ఏం వండుతున్నారు ఇవ్వాళ;' మళ్ళీ ప్రశ్నించింది అనసూయ ఇద్దరు సామాన్య స్త్రీలు కలుసుకున్నప్పుడు వచ్చే ప్రశ్నే అది! అయితే, అల్లాంటి తోటకూర ప్రశ్నలు,

శ్రీదేవికి అసలు నచ్చవు, ఏదో ఒకటి వండుకుంటారు. వండుకు తినక మానుకుంటారా? ఆ రోజుకి ఏది కలిగుంటే అది వండుకు తింటారు. ఎందుకు ఇంత అల్పమైన సంభాషణ చేయటం? ఇందువల్ల ఏం కలసి వస్తుంది? కాలం గడుస్తుంది. అంతకన్నా క్రిష్ణా, రామా, అనుకుంటూ కూర్చుంటే, భగవన్నామం జపించిన పుణ్యమన్నా దక్కుతుంది. తరుగు అరటి కాయలు చూపించింది.

'అరటికాయా! ఆవకూరా! వేపుడా! ఆవకూర అయితే, మా ఇంట్లో వేలేసిముట్టరు. వేపుడయితేనే తింటారు. మా నాలుగేళ్ళ చంటీకూడా వేపుడే కావాలని పట్టు పడ్తాడు అంది అనసూయ. వాళ్ళింట్లో అరటికాయని. ఎల్లావండితే తింటారో, తను అడగన్నా, అడగకుండానే, ఆ వివరాలు అనసూయ చెప్పినందుకు, సంతోషించింది. శ్రీదేవి.

'ఆఁ' అంది శ్రీదేవి.

'ఎనిమిదింటికే వెళ్ళిపోయారు కామాట్న! భోజనానికి వచ్చేసరికి ఒంటిగంటవుతుందల్లే వుంది: ఫలహారం ఏమన్నా చేస్తారా? అంది మళ్ళీ.

'ఆఁ ఏదో చేస్తోనేవుండాలి!' అంది శ్రీదేవి. ఇద్దరు వున్నప్పుడు, ఆ ఇద్దరుకూడ సంభాషణ ప్రియులయితే తప్ప సంభాషణ కొనసాగదు. శ్రీదేవి ఎందుకూ సంభాషణ తుంచేస్తుందే తప్ప పెంచదు. తను కొన్ని అడిగాక, శ్రీదేవి కూడా,

తమని గురించి అవీ ఇవీ అడుగుతూంటే సంభాషణ సరళంగా సాగుతుంది. అల్లా జరగకపోయే సరికి అనసూయకి కూర్చో బుద్ధి పుట్టలేదు. అయినా ఆమె వెళ్ళిపోలేదు. ఆ గదిలోంచి, ఈ గదిలోకి ఈ గదిలోంచి ఆ గదిలోకి, తిరుగుతూ, అలమారులోనివి. పుస్తకాలన్నీ తిరగేసి, రేడియోని ఒకసారి ట్యూన్ చేసి, ఫోటోలున్న ఆల్బంలన్నీ తిరగేస్తూ, తొమ్మిదిన్నర దాకా గడిపింది. నాగమణి, తొమ్మిదిన్నర అయినాక, కూతుర్ని పిలవటానికి వచ్చింది.

'వంటయిందేమిటి దేవిగారు!' అంది. నాగమణి.

'అవ్వొచ్చింది.' ముక్తసరిగా అంది. శ్రీదేవి.

'మా అనసు, మిమ్మల్ని వదలిపెట్టదు లెండి! మేము ఎక్కడున్నా అంతే! తల్లీ పిల్లల్లా కలిసిపోతాం ఇదిగో! మేమున్న మునుపువీధిలో ప్రక్కన వుండేవాళ్ళు తాయారక్కయ్య గారని! వాళ్ళు ఈ రోజు కబురంపించేరు. మేము ఈ ఇల్లు మారేక వాళ్ళ కేమీతోచట లేదుట! ఒక్కసారి మధ్యాహ్నంనించి వచ్చి పొమ్మని కబురంపించేరు. ఒక్క ఇంట్లోవున్నట్లే వుండేవాళ్ళం! మా పిల్లలుకూడా ఇట్టే కలిసి కలిసిపోతారు.' అంది నాగమణి.

శ్రీదేవికి ఇల్లా బాతాకానీ వేస్తూ కూర్చోవటం ఇష్టంగాలేదు. అయినా పీకలమీదకి వచ్చేక ఏమిచేస్తుంది!

'భోజనానికి రావే తల్లీ! స్కూలుకి టయిమ్ కాలా!' అంది. నాగమణి కూతుర్నుద్దేశించి.

టయిం అయిపోయింది' అంటూ అనసూయ. ఒక్క పరుగు పెట్టింది. తమ వాటాలోకి.

'మధ్యాహ్నం అలా పెద్దవీధి వెళ్ళి వస్తాం!' అంది. నాగమణి 'అమ్మయ్య ఒక్కపూట ఇల్లు ప్రశాంతంగా వుంటుంది. అనుకుంది శ్రీ దేవి.

మర్నాడు వుదయం రామూర్తి స్నానంచేసి జపం చేసుకుంటున్నాడు! నాగమణి చిన్నపాప పింగాణీ ప్లేటులో రెండు దోసెలు, కొంచెం చట్నీ వేసి తీసుకొచ్చి.

పిన్నిగారూ! మా అమ్మ. బాబాయిగారికియ్యమంది. అని గుమ్మంలో పెట్టింది శ్రీ దేవికి తీసుకోవాలో వద్దో అని భయపడింది. అయినా ఒకసారికి తీసుకున్న ఫరవాలేదు అని సమాధానపడి; ఆ ప్లేటుని లోపలికి తెచ్చినది. దాన్ని కంచం క్రింద దాచింది. భర్త మామూలుగా, టిఫిన్ చేసేప్పుడు ఒక దోసె వేసింది. రామూర్తికి అది బాగాలేదు. 'ఉప్మా చేసావుకా? మళ్ళీ దోసెకూడా ఎందుకు చేసావు? అన్నాడు.

'దోసెలు నేను చెయ్యలేదు ప్రక్కవాళ్ళు ఇచ్చారు.' అంది శ్రీదేవి.

అలా ఎప్పుడూ పుచ్చుకోకు నేను ఎవరింట్లోనన్నా ఎప్పుడన్నా తినటం నువ్వు రిగినావా?' అన్నాడు రామమూర్తి. రామమూర్తి ఎప్పుడూ, ఎక్కడ అరకప్పు కాఫీ అన్నా త్రాగి ఎరగడు అది శ్రీ దేవికూడా గుర్తించుకునే వుంటుంది ఎప్పుడూ.

రామ్మూర్తి ఆఫీసు కెళ్ళిపోగానే శ్రీదేవి తలుపులన్ని వేసి, వంటింట్లో కూర్చుంది. అనసూయ పెరటి తలుపు వేసి వచ్చింది.

తలుపులన్ని వేసుకు కూర్చున్నారేం పిన్నిగారూ ? ఏం తోస్తుందీ?' అంటూ సాగదీసింది.

'వంటపని వుందికదమ్మా !' అంది శ్రీదేవి.

'మా అమ్మాయికి, ఎవరో ఒకరు ప్రక్కన కూర్చుని కబుర్లాడుతుంటే కాని వంట చేయలేదు అంది అనసూయ. అదృష్టవంతురాలు ఒకరు నిశ్శబ్దాన్ని భరించలేరు ఎవరి మనః ప్రవృత్తులు వారివి. అవి ఇంకొకర్ని బాధించనంతవరకు ఎవళ్ళ అలవాట్లు వాళ్ళు అమలు జరుపుకోవచ్చును. అనుకుంది. శ్రీదేవి.

'దోసెలు ఎలా వున్నా యన్నారు. బాబాయిగారు? నేనేచేశాను. ప్రొద్దుటే మాకు ఎప్పుడో కాని ఫలారం అవసరం వుండదు. మా నాన్నగారు కాఫీ ఇంటివద్ద త్రాగి, ఫలహారం హోటల్లో తీసుకుంటారు. ఇవ్వాళ మీలాగే రోజు చేయాలని, మొదలుపెట్టాను' అంది అనసూయ బాగుండని.

'చాలా బాగున్నాయి' అన్నారు. తల్లీ కానీ అలా చేసినవి పుచ్చుకోవడం, మీ బాబాయిగారికి అంతగా ఇష్టం వుండదు. అందుకని, నన్ను కోప్పడ్డారు' అంది శ్రీదేవి.

'ఆఁ మగవాళ్ళలానే అంటూవుంటారులెండి. పిన్నిగారూ కాస్త మనసు కలిసిందంటే వాళ్ళే పట్టుకు పాకులాడుతారు

అంది ఎంతో అనుభవం వున్నదానిలా, అనసూయ. శ్రీదేవి
మాట్లాడలేదు ఆమెకి అనసూయ ప్రౌఢత్వం ఏమీ నచ్చ
లేదు. నాగమణి చిరుసిగ్గులు కూడా నచ్చలేదు ఒకరోజు.

'మీరు రేడియోలో పాడేవారట కాదూ' ఎంతో
డిటెక్షన్ చేసినదానిలా అడిగింది నాగమణి శ్రీదేవిని. రేడి
యోలో కొన్ని రోజులు లలిత సంగీతం పాడేది ఈమధ్య
ఈ మధ్య తీరక మానేసింది.

'అవునండీ! మునుపు పాడేదాన్ని' అంది శ్రీదేవి.

'అంతమంది మగాళ్ళల్లో ఎల్లాపాడుతారండీ! అబ్బ!
నాకు చచ్చేసిగ్గు మరిదిగారు. స్నానానికి వస్తోంటే మొన్న,
చూసాను ఆయన్ని చూసేసరికి నాకు చచ్చేసిగ్గు వేసిందంటె
నమ్మండి! దెవిగారూ!' అంది నాగమణి. శ్రీదెవి ఏమీ
అనలేదు. రోడ్డుమీద తొంభయ్ మంది మగవాళ్లూ నడచి
పోతూంటారు. వాళ్ళనిచూసినప్పుల్లా చచ్చేసిగ్గు ఎందుకని
ముంచుకవస్తుందో, శ్రీ దెవికి అనుభవంలోకి ఎప్పుడూ
రాలేదు.

'మీది మేనరికం అనుకుంటాను' అంది. నాగమణి.
శ్రీదెవికి వళ్లు మండింది తమది. ఏ అరికం అయితే తమ
కెందుకు? తను ఎప్పుడున్నా వాళ్ళ సంసార విషయాలు అడి
గిందా! ఎదుటి వ్యక్తి ప్రవర్తనను చూసయినా, వాళ్ళ
ప్రవర్తనని మార్చుకుందామన్న ధ్యాసే కలగని వ్యక్తుల్ని

మూర్ఖులనక ఏ మనుకోవాలి? కోపం కప్పి పెట్టుకుంటూనే' అవునండీ! అంది శ్రీ దేవి.

'అదె అనుకున్నాను? ఆయన చిన్నారిలా, అగుపడ్తారు. ఏమనుకోకండి. మీరు కాస్త వయిసుమీరినట్లు అగుపడ్తారు. ఇలాంటి దాంపత్యం దగ్గిరి సంబంధాలయితే కుదురుతాయి. పై వాళ్ళయితే ఎంచి ఎంచి చేసుకుంటారు. దగ్గర వారయితే ఎలావున్నా ముడెట్టుకుంటారు. నాకు ఏమాటన్నా మనసులో దాచుకోటం అలవాటులేదు. ఏమన్నా ముఖం ఎదుటే అనేస్తాను' అంది నాగమణి.

'అదే మంచిదిలెండి' అన్నది శ్రీదేవి. మర్నాడు మళ్ళీ ఏవో ఫలహారంచేసి అనసూయ పట్టుకొచ్చింది. శ్రీదేవి పుచ్చుకోలేదు.

'వద్దు మీ బాబాయిగారు కోప్పడతారు అని త్రిప్పి పంపేసింది.

'మహా గీర్వాణం ఎంతసేపు మనం వాగినా, ఆఁఅనో తప్ప, మాట అయినా మాట్లాడలేదు.' అంది అనసూయ.

పెద్దదానితో వాగుతూ కూర్చుంటే కాని మనకు గడవదా ఏమిటి? అంది. నాగమణి. ఒకవారం రోజులకల్లా శ్రీదేవి ముభావం, వాళ్ళకి ముఖంమొత్తింది. ఎలాగైనా శ్రీదేవిని తమలా వాగుతుండేటు తయారుచెయ్యాలని ప్రయత్నించారు. ఆ ప్రయత్నం విఫలం అయ్యేప్పటికి దండయాత్రకి ధ్వజ

మెత్తారు. మనం మంచిగా వుండాలంటే మనం ఒక్కళ్ళం మంచిగావుంటే చాలదు. పరిసరాలుకూడా మంచిగా వుండాలి.

శ్రీ దేవియొక్క, శాంతియుత జీవితంలో, నాగమణి వాళ్ళు. కల కలం రేపారు. ఏమీ అనకున్నా. తన వాటాలో తమ బంధితురాలై కూర్చున్నా ఆమె ఎవరూ లేనప్పుడు తమని, నానామాటలు అంటున్నదని, కల్పించి చెప్పారు. అప్పారావు నవ్వాడు. అతను నమ్మకచేసేదేమీలేదు, నలుగురు పిల్లలుతల్లి అయిన నాగమణికి అబద్ధం చెపాల్సిన అవసరం వుండదు అని. అప్పారావుకు నమ్మక నాగమణకి, కావాల్సిన వుపకారం, శ్రీదేవి వల్లకాలేదు. అందుచేత నాగమణి శ్రీ దేవిమీద కచ్చ పెంచుకుంది.

శ్రీ దేవికి మనస్తాపంకలిగింది. ఆఫీసునించి ఇంటికి వచ్చి నాక భర్తకి అంతా చెప్పాలనుకుంది. ప్రక్కవాటాలో ఏవో మాటలు విన్పించాయి.

'మీ పొరుగామె బుద్ధిగావుంటోందా ? మణీ' అంది తాయారమ్మ.

'ఆఁ అదేబుద్ధి దాలిగుంటలోకుక్కబుద్ధి దాని మొగుడు. మా వారికి క్షమార్పణ చెప్పుకున్నాడు. అందుచే మావారు దానొంక చూడకుండా రోజులు గడుపుకోని. నన్ను కోప పడ్డారు.' అంది నాగమణి.

శ్రీదేవి గాఢంగా నిట్టూర్చింది. ఇందులో ఎవరు క్షంతవ్యులో ఎవరికి తెలుసును !

ఇల్లాంటి స్త్రీ సహజ కుచ్ఛితాన్ని మగవాళ్ళతో చెప్పి తన సంసారం నరకప్రాయం చేసుకోవటం, శ్రీదేవికి నచ్చలేదు ఇల్లాంటి ఇరుగూ పొరుగూవుంటే ఇంక మిగిలినవాళ్ళకి, కాలక్షేపాలకేమీ లోటురాదు. అదొక విధమైన పల్లెమోటుతనం ప్రతి నిత్యం ఎవరో ఒకరు తమని నానాహింసలు పెట్టున్నారనుకోవటంలో వాళ్ళకొక తృప్తి కలుగుతుంది. అల్లాంటి వారిని, తను క్షమించాలి అనుకుంది. శ్రీదేవి క్షమాభావన వచ్చేసరికి ఆమె హృదయం, నిశ్చలం అయ్యింది. నిబ్బరంగా తన పని తాను చేసుకోసాగింది. నాగమణి వైద్యంవల్ల తనకే లబ్ధికలిగింది. అనవసర సంభాషణలు వదిలాయ్ నోరు నొప్పి పెటేదాకా. తిట్టుకుని తర్వాత వాళ్ళే వూరుకుంటారు. అస్తమానూ, వేళాపాళాలేని రాకపోకలు తగ్గాయ్ అనుకుంది. శ్రీదేవి క్షమాగుణంవల్ల మనస్సు విశాలమౌతుంది.

—o—